క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



దాచేపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు మెరుగుపర్చాలని ఎంపీపీ కందుల జాను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఎంపీపీ జాను మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని, గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు చేసి రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో సూపరింటెండెంట్ వీరయ్య పాల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

సత్రశాల(రెంటచింతల): స్థానిక గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో సోమవారం మూల నక్షత్రం సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు పరాశక్తి వైస్ చైర్మన్ ఎంఎస్ఎన్ రాజు పలకలు, పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. రెంటచింతల పాఠశాలలకు చెందిన విద్యార్థులతో భరతనాట్యం, జెట్టిపాలెం గ్రామానికి చెందిన పిల్లలు కోలాటం ప్రదర్శించారు. కార్యక్రమాలను దేవస్థానం ఈఓ గాదె రామిరెడ్డి, చైర్మన్ గుండా వెంకట శివయ్య పర్యవేక్షించారు.

భూ కబ్జాదారులపై చర్య తీసుకోవాలి



మాచర్ల రూరల్: తన పూర్వీకులు కొనుగోలు చేసిన 50 సెంట్లు భూమిని తిరిగి ఇప్పించాలని తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్‌కు మాచర్ల రాజా సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు అర్జీలు అందించారు. 18వ వార్డుకు చెందిన మాచర్ల రాజా తన నాయనమ్మ మాచర్ల బాలమ్మ స.నె. 1058లో 50సెంట్లుకు పేరు మార్చారని అర్జీలో పేర్కొన్నారు. లెప్రసీ కాలనీలో తన పూర్వీకులు కొనుగోలు చేసిన 50సెంట్లు భూమిని కొందరు కబ్జాదారులు నకిలీ పత్రాలు, లింకు డాక్యుమెంట్లు సృష్టించారని ఫిర్యాదు వివరించారు.

రెంటచింతలలో సమస్యలు పరిష్కరించండి

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో నెలకున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని రెంటచింతల గ్రామ సామాజిక అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పల్లెర్ల కేశవరెడ్డి అన్నారు. సోమవారం గ్రామంలో ఉన్న 43 సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆయన సామాజిక అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి తహసీల్దార్ దొప్పలపూడి మేరి కనకంకు అందచేశారు. ఆయన మాట్లాడుతూ రెంటచింతల గ్రామంలో ఎంతో కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ నారాయణపురం శ్రీనివాసరావు, సభ్యులు గంజి ఇన్నారెడ్డి, కట్టా బాల, నాళం పెదబాబు, నాగయ్య పాల్గొన్నారు.

రోగులతో కిటకిటలాడిన ప్రభుత్వ ఆస్పత్రి



మాచర్ల: పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రి రోగులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి బారులు తీరి ఓపీకి పోటీ పడ్డారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వైద్యం నిమిత్తం పలువురు తరలివచ్చారు. సూపరింటెండెంట్ కేపీ చారి ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ వైద్యం అందజేశారు. సోమవారం మళ్లీ అత్యధిక సంఖ్యలో ఓపీ నమోదైంది.

పీహెచ్‌సీల్లో ఆగిన వైద్య సేవలు

- విధులను బహిష్కరించిన డాక్టర్లు
- సేవలు అందక రోగుల ఇక్కట్లు
- కూటమి ప్రభుత్వంపై భగ్గుమంటున్న ప్రజలు



జ్వరంతో దాచేపల్లి పీహెచ్‌సీలో రోగులు

దాచేపల్లి: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. ఇప్పటికే ఆరోగ్యశ్రీ నిలిచిపోగా తాజాగా డాక్టర్ల సమ్మెతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం కరువైంది. పీహెచ్‌సీలలో పనిచేస్తున్న డాక్టర్ల న్యాయమైన డిమాండ్ల సాధనతో పాటుగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డాక్టర్లు సమ్మెబాట పట్టారు. రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఏ గ్రామంలో చూసిన జ్వరపీడితులు అధికంగా ఉన్నారు. కొన్ని చోట్ల వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న వారు కూడా ఉన్నారు.

నిలిచిన వైద్యసేవలు..

దాచేపల్లిలోని రెండు, గామాలపాడు, నడికుడిలలోని పీహెచ్‌సీలలో వైద్యసేవలు నిలిచాయి. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు సమ్మెలో ఉండటంతో వైద్యసేవలను అందించటంలేదు. దాచేపల్లి పీహెచ్‌సీలో రోజు 200 మందికిపైగా రోగులు వచ్చి వైద్యసేవలు పొందుతారు. ప్రస్తుతం జ్వరాలు, వాంతులు, విరోచనాలు అధికంగా ఉన్నాయి. వీరంతా పీహెచ్‌సీలకు వచ్చి డాక్టర్లు లేక వెనుదిరుగుతున్నారు. మండల పరిధిలోని పీహెచ్‌సీలలో వైద్యసేవలు అందకపోవటంతో కూటమి ప్రభుత్వం తీరుపట్ల ప్రజలు మండిపడుతున్నారు. అంతేకాకుండా 108,104 వాహనాల్లో కూడా డాక్టర్ల సేవలకు అంతరాయం కలిగింది.

ఓపీ సేవలను బహిష్కరించిన వైద్యులు..

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక వైద్యుల సంఘం ఆధ్వర్యంలో వైద్యాధికారుల సమస్యల పరిష్కారం కోసం గత నాలుగు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ సేవలను వైద్య సిబ్బంది బహిష్కరించారు. దీర్ఘకాలిక సమస్యలు, గత సంవత్సరం ఉన్నతాధికారుల ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా ఇంత వరకు అమలు చేయకపోగా విరుద్ధంగా చర్యలు తీసుకోబడ్డాయని, ఈ నేపథ్యంలో చేపట్టిన నిరసనలో భాగంగా అవుట్ పేషంట్(ఓపీ) సేవలను నిలిపివేస్తున్నామని వైద్యులు తెలిపారు. ప్రధానంగా వైద్యుల డిమాండ్లు గత 20 నుంచి 25 సంవత్సరాల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగోన్నతి లేక ఒకే హోదాలో సేవలు అందిస్తున్న వైద్యాధికారులకు న్యాయం చేయాలంటే తక్షణమే ప్రమోషన్లు కల్పించాలని, అలాగే ఇన్‌సర్వీస్‌సెస్ పీజీ క్వాటాను పునరుద్ధరించటం, జీవో 99ని రద్దు చేయాలని, నోషనల్ ఇన్‌క్రిమెంట్‌లను వెంటనే మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాలలో సేవలు అందిస్తున్న వైద్యులకు 50 శాతం మూల వేతనను గిరిజన భత్యంగా మంజూరు చేయాలని, చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమానికి రూ.5 వేల భత్యం మంజూరు చేయాలని, స్థానికత్వం, పట్టణాధికారుల సర్వీసెస్, అర్హత సమస్యలను పరిష్కరించటంతో పాటు ఇతర అన్ని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారాన్ని ప్రభుత్వం అందించాలని, సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతాయని ఈ సందర్భంగా వైద్యాధికారిణి రమాదేవి తెలిపారు.



ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు దాచేపల్లి పీహెచ్‌సీలో అంటించిన నోటీస్

ప్లాస్టిక్ రహిత నగర పంచాయతీగా తీర్చిదిద్దుతాం

చైర్‌పర్సన్ కోప్పుల సుబ్బమ్మ

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధిద్దామని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. స్థానిక సచివాలయం–1లో కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో స్వచ్ఛతా హీ సేవా, ప్లాస్టిక్ నిషేధం, ప్రధానమంత్రి స్వానిధి లోక కల్యాణ్ మేళా, దసరా పండుగ సందర్భంగా ముగ్గుల పోటీల నిర్వహణపై చర్చించారు. పై అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ప్లాస్టిక్ రహిత నగర పంచాయతీగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్లాస్టిక్ నిషేధపై ప్రజలకు దశల వారీగా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ సుబ్బమ్మ చెప్పారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కమిషనర్ జి.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు కొమెరబత్తిన అన్నపూర్ణ, షేక్ మస్తాన్ బీ, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, నాగుబండి గురువులు, వందనపు వెంకట్రావ్, దేవళ్ల లక్ష్మీప్రసన్న, మందపాటి సౌజన్య, ఈదా శశిదేవి, జగన్నాధం పాల్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రఫీ, గుంజా వెంకటప్పయ్య, వేల్పుల అంజమ్మ పాల్గొన్నారు.

పోషణ స్థాయి పెంచటమే అంగన్‌వాడీ లక్ష్యం



అంగన్‌వాడీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో పి. రాజేశ్వరి

పిడుగురాళ్లరూరల్: పిల్లలలో పోషణ స్థాయిని పెంచటమే అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీఓ పి.రాజేశ్వరి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. మాత శిశుమరణాలను తగ్గించటంతోపాటు ఆరోగ్య వంతులను తీర్చిదిద్దటమే పోషణ మాసం యొక్క లక్ష్యమని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు మూడేళ్లలోపు పిల్లలకు పాలు, గుడ్లు, బాలామృతంతోపాటు పలు రకాల పోషకాలను అందిస్తున్నామన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రిపాలు తాపటం, పిల్లల అనుబంధ ఆహారంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆరోగ్య కరమైన ఆహార అలవాట్లు, జీవన శైలిపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.అంజలి, అంగన్‌వాడీ టీచర్లు సీత, కృష్ణాంజలి, మాధవి, అంజలి పాల్గొన్నారు.


పొగాకు సాగు చేయవద్దు..



మాచర్ల: మండలంలో హెచ్‌డీ బ్లాక్ పరిధిలో పొగాకు వేయవద్దని ఏఓ పాపాయమ్మ కోరారు. సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొగాకు రకాన్ని నివారించాల్సిన అవసరం ఎంతో ఉందని, ఎవరూ సాగు చేయవద్దని, వైట్ బార్లీ పొగాకు సాగు చేసిన బ్రాండ్ ఉంటేనే సాగు చేయాలన్నారు. పొగాకు బదులు ఇతర అపరాల పంటలను సాగు చేసుకోవాలన్నారు. ప్రతి రైతు పండించే పంటను నమోదు చేసుకోవాలన్నారు.



పిడుగురాళ్ల... నాగుల గుడిలో మహాసరస్వతీగా అమ్మవారు



పిడుగురాళ్లలో సరస్వతీదేవిగా వాసవీమాత



బ్రహ్మంగారి దేవాలయం అమ్మవారు..



పట్టణంలోని శివాలయం వద్ద సరస్వతీ దేవిగా అలంకరణ



సత్యసాయిబాబా మందిరంలో సరస్వతీ దేవిగా అమ్మవారు



దాచేపల్లి రోడ్డులో సరస్వతీ దేవిగా వాసవీ అమ్మవారు



గురజాల వాగ్దేవి కళాశాల వద్ద సరస్వతీ దేవి అలంకరణ



సరస్వతీ దేవి అలంకారణలో వాసవి కన్యకా పరమేశ్వరి

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

పిడుగురాళ్ల: పట్టణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో మహా సరస్వతి అమ్మవారిని మూలా నక్షత్రం సందర్భంగా విశేషంగా అలంకరించారు. వాసవీ అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. మధ్యాహ్న సమయంలో అన్నసంతర్పణ నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ వెనుక వైపు ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారిని సరస్వతీదేవి అలంకరణతో పాటు మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు నిర్వహించారు. పట్టణంలోని భవానీ నగర్‌లోని కనక దుర్గమ్మ సరస్వతీ దేవిగా అలంకరించారు. పట్టణంలోని బ్రహ్మంగారి దేవాలయం వద్ద ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గంగమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. శివాలయం వద్ద అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. పట్టణంలోని సత్యసాయి బాబా మందిరంలో మల్లెపూలతో సరస్వతి దేవిగా అలంకరించారు. ఉదయం పది గంటల సమయంలో చిన్న పిల్లలచే చక్రానికి కుంకుమార్చన చేసి పిల్లలకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.

సరస్వతీదేవిగా అమ్మవారు దర్శనం

దాచేపల్లి: దేవిశరన్నవరాత్రుల సందర్భంగా సోమవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దాచేపల్లిలోని వీర్ల అంకమ్మతల్లి దేవాలయం, బొడ్రాయి సెంటర్, నారాయణపురం, రెడ్లబజార్‌లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రసాదాలు భక్తులు అందజేశారు.



పాలువాయి జంక్షన్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో కుంకుమపూజ

అన్నపూర్ణేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

మాచర్ల రూరల్: పట్టణంలోని అన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఆలయంలో న్యూటన్స్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, పద్మావతి దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్నులు, బలపాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు పాల్వాయి భాస్కర్, చిన్ని సత్యనారాయణ, వీర్నాల నాగేశ్వరరావు, రాచమడుగు వెంకటేశ్వర్లు, పందిరి బాల గురవయ్య పాల్గొన్నారు.

మాచవరం: దేవి శరన్నవరాత్రుల భాగంగా మండల కేంద్రమైన మాచవరం వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం, భ్రమరాంబిక సమేత చిన్ను మల్లేశ్వర స్వామి దేవాలయం, మండలంలోని చెన్నాయపాలెంలోని రేణుక అమ్మవారి దేవాలయంలో అమ్మవార్లు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

మాచర్ల: మాచర్ల పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం అమ్మవారిని సరస్వతీదేవి అలంకరణ చేశారు. పత్తి ఫ్యాక్టరీ ఆవరణలోని సాయిబాబా మందిరంలో లలిత అమ్మవారు, సొసైటీ కాలనీలోని అన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఆలయం, చంద్రవంక బ్రిడ్జి ప్రాంతంలో ఆదిలక్ష్మి అమ్మవారి దేవాలయం, ప్రధాన రహదారిలోని కోదండరామాలయంలో సరస్వతీదేవి అమ్మవారి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షులు భవనాశి వెంకటేశ్వర్లు, బచ్చు రామారావు, పాల్వాయి భాస్కర్, కొత్తమాసు వీరాంజనేయులు, పందిరి బాల గురవయ్య, భవనాశి రవితేజ, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, వీర్నాల నాగేశ్వరరావు, రాచమడుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గురజాల: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు భక్తులకు సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానిక నవోదయ జూనియర్ కళాశాల సమీపంలోని దుర్గా వైష్ణవి వాగ్దేవి ఫ్రెండ్స్ సర్కిల్, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, రెడ్డి బండ సెంటర్‌లోని అమ్మవారి విగ్రహాలు భక్తులకు దర్శనమిచ్చారు.

సరస్వతీదేవిగా వాసవి అమ్మవారు

రెంటచింతల: దేవి శరన్నవ రాత్రుల మహోత్సవాలలో భాగంగా సోమవారం మండలంలోని పాలువాయిజంక్షన్ వద్ద త్రిశక్తిపీఠంగా విరాజిల్లుతున్న కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో కనకదుర్గమ్మ అమ్మవారు సరస్వతీదేవి, లక్ష్మీదేవి విజయ లక్ష్మిగా, సరస్వతి అమ్మవారు కామేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు దేవాలయాలకు చేరుకొని అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కుంకుమపూజను, హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి రథోత్సవంలో పాల్గొన్నారు. మహాన్నదానం చేపట్టారు. దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు యేచూరి సాంబశివరావు ఏర్పాట్లును పర్యవేక్షించారు. సత్రశాలలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో భ్రమరాంబిక అమ్మవారు, స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి పూజలు అందుకున్నారు. సత్రశాల దేవస్థానంలో దసరా ఉత్సవాల నిర్వహణకు స్థానిక పరాశక్తి సిమెంట్ కర్మాగారం యాజమాన్యం తరుపున వైస్ చైర్మన్ ఎంఎస్ఎన్ రాజు రూ. లక్ష విరాళంగా దేవస్థానం చైర్మన్ గుండా వెంకట శివయ్య, ఈఓ గాదె రామిరెడ్డికి అందజేశారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు కట్టమూరి వెంకట నాగేశ్వర రావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రూ. లక్ష విరాళంగా అందజేస్తున్న పరాశక్తి వైస్ చైర్మన్ ఎంఎస్ఎన్ రాజు



మాచవరంలో సరస్వతీదేవిగా అమ్మవారి అలంకరణ



మంచికల్లు చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సరస్వతీదేవిగా..



సత్రశాలలో సరస్వతీదేవిగా భ్రమరాంభికాదేవి అమ్మవారు



రెంటచింతలలో గాయత్రిదేవిగా వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు



నారాయణపురంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



దాచేపల్లి అంకమ్మతల్లి దేవాలయంలో సరస్వతీ అలంకరణ..



దాచేపల్లి బొడ్రాయిసెంటర్‌లో ప్రత్యేక అలంకరణ

డిజిటల్ యాప్‌తో కూటమికి గుణపాఠం

మాచర్ల రూరల్: ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీలపై కూటమి నేతలు చేస్తున్న అరాచకాలపై భవిష్యత్తులో డిజిటల్ యాప్ ద్వారా తగిన గుణపాఠం చెబుదామని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి కోటిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కొత్తపల్లిలో వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అసమర్థతతో ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని చెపఆపరు. ప్రతి ఒక్కరినీ గుర్తు పెట్టుకొని యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కొండ శివలింగరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి ఓరుగంటి జయప్రకాశ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి ఆరికట్ల పున్నారెడ్డి, నాయకులు గొబ్బూరి అదయ్య, గోగిరెడ్డి అనిమిరెడ్డి, మల్లెల శ్రీనివాసరావు, జూకూరి వెంకటరామయ్య, ఎంద్ర గాలయ్య, గాలి బాల్‌రెడ్డి, ఓరుగంటి జయ, లక్ష్మయ్య, కొండలు, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.



డిజిటల్ యాప్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కారెంపూడిలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కారెంపూడి: డిజిటల్ బుక్‌ను కారెంపూడిలో వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వలన అక్రమంగా అన్యాయంగా కేసులు వేధింపులకు ఇతరత్రా సకల దౌర్జన్యాలకు గురైన వారు తమ పేర్లు పుస్తకంలో నమోదు కోసం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జాన్‌పాల్ నాయక్, వివిధ హోదాల వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిన అల్లయ్య, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, షేక్ ఆరీఫ్ పాల్గొన్నారు.